కాలుతుంది. తడి ఇసుక ఎండుతుంది. బురద గట్టిపడుతుంది. రంపం పొట్టు మండిపోతుంది. ఇవన్నీ వాటి వాటి ధర్మాలని అనుసరించి ప్రవర్తిస్తాయి. అలాగే ఏ సందర్భంలోనైనా మనుషుల చెడు లేదా మంచి సంస్కారాలు బయటపడతాయి. మన సంస్కారాల ద్వారా మనం చేసే కర్మలే మనల్ని స్వర్గానికి, లేదా నరకానికి చేర్చేవి. మరణానంతరం మనిషి గమ్యాన్ని నిర్ణయించేవి కూడా అవే. కాబట్టి చెడు సంస్కారులు నరకానికి వెళ్ళకుండా వుండటానికి గాను, బ్రతికి వున్నప్పుడే వాటిని వదిలించుకోవాలి. నరకానికి వెళ్ళకుండా కాపాడే మంచి సంస్కారాలు అలవర్చుకోవాలి.”

## 106. చెడు కోసం మంచి

హైద్రాబాద్‌లోని ఇద్దరు బ్రాహ్మణులకి ఆస్తమా వ్యాధి వుంది. చేప మందు తింటే ఆ రోగం నయం అవుతుందని వాళ్ళిద్దరూ విన్నారు. అయితే ఇద్దరూ పూర్తిగా శాకాహారులు. ఒకడు చేపని మింగడం విషయంలో సంశయించాడు. ఇంకొకడు తన మీద ఆధారపడ్డ భార్యా పిల్లలు తను ఇంకా క్షీణిస్తే ఇబ్బందికి గురవుతారని వెళ్ళి ఆ చేప మందుని మింగాడు. దాంతో అతని ఆస్తమా పోయింది.

పాపభీతి గల రెండోవాడు చేపమందుని తినకపోవడంతో ఆ రోగం అధికం అయి ఓ తెల్లవారుఝామున ఊపిరాడక మరణించాడు. అతని భార్యా పిల్లలు అనాధలై అనేక కష్టాలకి గురయ్యారు.

మంచిపని కోసం కొంత చెడు చేసినా పాపం కాదు. కాని చెడు కోసం చేసే ప్రతీ మంచి పనీ పాపమే అవుతుంది.

## 107. పాదుకల విలువ

ఓ రాజుగారికి ఓ రోజు ఓ సందేహం వచ్చింది. తన గురువుని కలిసి అడిగాడు.

"స్వామీ! మీరు మా కళ్ళెదుట ఉండగా మిమ్మల్ని కాక మీ పాదుకలకి నమస్కరిస్తున్నాం. ఎందుకిలా?"

"ఎందుకంటే నా కన్నా నా పాదుకలకి విలువ ఎక్కువ. ఆ మాటకొస్తే నీకన్నా నీ చెప్పులకే ఎక్కువ విలువ, గౌరవం అని నీకు తెలీదు." నవ్వి జవాబు చెప్పాడు గురువు.

"అదేమిటి? మీ కన్నా మీ పాదుకలకి ఎక్కువ విలువ ఉండచ్చు. కాని నాకన్నా నా చెప్పులకి ఎక్కువ గౌరవం అంటే నమ్మలేకపోతున్నాను. మీ పాదుకలకి మొక్కినట్లుగా నా చెప్పులకి ఎవరూ మొక్కరే?" అపనమ్మకంగా చూస్తూ అడిగాడు రాజు.

"ఒక్క నీ చెప్పులకే కాదు. ప్రపంచంలోని ఏ మనిషికన్నా అతని చెప్పులకే ఎక్కువ గౌరవం లభిస్తుంది." గురువు మళ్ళీ చెప్పాడు.

తను చెప్పేది రాజుకి అర్థం అయ్యేలా మళ్ళీ ఆ గురువు ఇలా చెప్పడు.

"నీ మంత్రి చెప్పులు చిరిగాయనుకో. అతను ఒక్క రాత్రికి నీ చెప్పులని నీ ఇంట్లో ఉంచి వెళతానంటే ఏమంటావు?" ప్రశ్నించాడు గురువు.

"సరేనంటాను." జవాబు చెప్పాడు రాజు.

"అదే అతను మరణిస్తే ఓ రాత్రికి అతని శవాన్ని మీ ఇంట్లో ఉంచమంటే ఏమంటావు?"

ఆ ప్రశ్నతో రాజుకి గురువు చెప్పిన మాటల వెనక సత్యం అర్థం అయింది.

## 108. నామస్మరణ మహత్యం

నామస్మరణ చేస్తే పాపాలు తగ్గుతాయి అని ఓ గురువు చెప్పిన హితబోధ ఆయన శిష్యుల్లో ఒకరికి అర్థం కాలేదు. రామ రామ లేదా కృష్ణ